సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుతో ఈస్ట్ కాలనీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు

మోతీనగర్: సంక్షేమ సంఘాలు రాజకీయాలకు అతీతంగా స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. ఇటీవల అవంతీనగర్ ఈస్ట్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుపొందిన పి. నర్సింహారెడ్డి బుధవారం ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, తన్నీరు తిరుపతిరావు, అంకం వీరబాబు, తక్కళ్లపల్లి దేవందర్‌రావు, బండారి సుశీల్‌కుమార్ యాదవ్, రమేష్ చౌహాన్, రమణ, శర్మ, శ్రీకాంత్, శివ, వంశీ, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ నూతన కమిటీ ఎన్నిక



సంఘం మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: ప్రొగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర(పీఆర్‌టీయూ టీఎస్) కూకట్‌పల్లి మండల నూతన కమిటీని బుధవారం ప్రకటించారు. అధ్యక్షుడిగా ఎం. వెంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శిగా సి. విఠల్, అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్. చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడిగా పి. రవీంద్ర, మహిళా అధ్యక్షురాలిగా బి.రాధిక, కార్యదర్శిగా ఆర్. వీరేందర్, మహిళా కార్యదర్శిగా ఎస్ లక్ష్మి ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు ఉన్నత స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులతో ఎప్పటికప్పుడు చర్చిస్తానన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, వృద్ధులు

ఓల్డ్ బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లిలోని జీహెచ్‌ఎంసీ వార్డు కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 50 సంవత్సరాలు పై బడిన వారికి రక్తపోటు, మధుమేహం, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, అజీర్ణం, అర్శ మొలలు తదితర వాటికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులను కూడా అందజేశారు. కార్యక్రమంలో అధికారి శ్రవణ్, డాక్టర్ పార్వతి, వినోద రాణి, స్వరూప, ఆశా వర్కర్లు దివ్య, గుణ సుందరి తదితరులు పాల్గొన్నారు.

కొరివి కృష్ణస్వామి ముదిరాజ్‌సేవా సమితి అధ్యక్షుడిగా నరేందర్



రాయదుర్గం: కొరివి కృష్ణస్వామిముదిరాజ్ సేవా సమితి శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా నీలం నరేందర్‌కుమార్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొండెటి సత్యం ముదిరాజ్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ సమితి రాజకీయపార్టీ కాదని, కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమన్నారు. విద్యా, వైద్య, ఉపాధి, విగ్రహావిష్కరణ లక్ష్యాలుగా సమితి పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో పలు కార్యక్రమాలను చేపట్టేందుకు తగిన చొరవ తీసుకుంటామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గంతోపాటు 119 నియోజకవర్గాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు.

పీఎం రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, సిటీబ్యూరో: వివిధ రంగాలలో ప్రతిభచాటిన బాల బాలికలకు 2025 సంవత్సరంలో అందించనున్న ప్రధాన మంత్రి రాష్ట్రీయ పురస్కార్ అవార్డులకు ఈ నెల 31 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా సంక్షేమ శాఖ అధికారి ఎం.కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు మెడల్‌తోసహా సర్టిఫికెట్, ఇతర బహుమతులు ఉంటాయన్నారు. ఈ అవార్డులకు సంబంధించి 5 నుంచి 18 ఏళ్ల లోపు ఉన్నవారు మాత్రమే అర్హులన్నారు. అభ్యర్థులు ఇన్నోవేషన్, సోషల్ సర్వీస్, ధైర్య సాహసాలు, పాండిత్యం, క్రీడలు, కళలు, సాంస్కృతిక కళలు వంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. జాతీయ అవార్డుల పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న తరువాత జిల్లా కలెక్టరేట్‌లోని మహిళా, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల అభివృద్ధి శాఖ అధికారి కార్యాలయంలో ప్రతిని సమర్పించాలన్నారు.

కూకట్‌పల్లిలో యువతి కిడ్నాప్

రక్షించిన మద్దూరు పోలీసులు



మద్దూరు(హుస్నాబాద్): కూకట్‌పల్లిలో కిడ్నాప్ అయిన యువతిని ధూల్మిట్ట మండలంలోని లింగాపూర్ గ్రామ పరిధిలోని జెల్లగూడంలో మద్దూరు పోలీసులు కాపాడారు. సీఐ శ్రీను కథనం మేరకు..హన్మకొండ జిల్లాకు చెందిన నాలీబాల శిరీష(23)ని ములుగు జిల్లాకు చెందిన తీగల రాజశేఖర్‌రెడ్డి(30) మాయమాటలు చెప్పి కిడ్నాప్ చేసి జెల్లగూడంకు మంగళవారం తీసుకొచ్చాడు. రాజశేఖర్ రెడ్డి ప్రవర్తనలో మార్పు గమనించిన యువతి బుధవారం ఉదయం 7 గంటలకు డయల్ 100కి కాల్ చేసి తాను కిడ్నాప్‌కు గురయ్యానని తెలిపింది. స్పందించిన ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ జగదీశ్వర్ హుటాహుటిన గ్రామానికి వెళ్లి ఇరువురిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. విచారణలో యువతిపై కూకట్‌పల్లిలో పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదైనట్లు తెలుసుకున్నారు. కాగా యువతీ, యువకుడు కూకట్‌పల్లిలోని ఆస్పిరో ఫార్మాసిటికల్స్ కంపెనీలో పని చేస్తున్నారు. అమ్మాయిని కాపాడిన ఎస్ఐ, ఏఎస్ఐలను సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ అభినందించారు.

ఇళ్లు సరే.. వసతులేవి?



రోడ్డు పక్కనే ఎస్టీపీ నిర్మాణం

- గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూంల కేటాయింపు
- 8 నెలలు గడుస్తున్నా సదుపాయాలు కరువు
- అద్దె ఇళ్లల్లోనే లబ్ధిదారులు

నిజాంపేట్: డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయిస్తూ గత ప్రభుత్వం సంబంధిత పత్రాలను లబ్దిదారులకు అందజేసింది. కానీ అందులో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో లబ్దిదారులు అద్దె ఇళ్లల్లోనే కాలం వెల్లదీస్తున్నారు. అధికారులు తాగు నీరు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేకపోయారు. ఇండ్లు కేటాయించి ఎడెనిమిది నెలలు గడుస్తున్న మౌలిక వసతులు కల్పించడంలో తీవ్ర జాప్యం జరుగుతుంది. బాచుపల్లి మండలంలోని నిజాంపేట్‌లో 1440 ప్లాట్స్, బాచుపల్లిలో 1080 ప్లాట్స్ నిర్మించారు. విద్యుత్ లైన్లను సైతం పూర్తి స్థాయిలో ఏర్పాటు చేయలేదు. ప్రస్తుతం ట్రాన్స్‌ఫార్మర్‌ల పనులు మొదలు పెట్టారు.

స్విమ్మింగ్‌పూల్‌గా సెల్లార్లు

ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరద నీరు సెల్లార్‌లలోకి చేరి సెల్లార్లు అన్నీ స్విమ్మింగ్ పూల్‌ను తలపిస్తున్నాయి. దీంతో డబుల్ బెడ్ రూం భవనాల పిల్లర్లు దెబ్బతినే ప్రమాదం ఉందని లబ్దిదారులు ఆందోళన చెందుతున్నారు. సెల్లార్‌లల్లో చేరిన వరద నీటిని కూడా తొలగించే ఏర్పాట్లు చేయడంలో సంబంధిత అధికారులు పూర్తిగా విఫలమయ్యారనే చెప్పవచ్చు.

రోడ్డు విస్తరణకు అడ్డుగా ఎస్టీపీ నిర్మాణం!

నిజాంపేట్ వాటర్ ట్యాంకు నుంచి జర్నలిస్టు కాలనీ, డబుల్ బెడ్ రూంల సముదాయం నుంచి తెలుగు విశ్వవిద్యాలయం మీదుగా బాచుపల్లి విజ్ఞాన జ్యోతి స్కూల్ వరకు హెచ్‌ఎండీఏ 100 ఫీట్ల రోడ్డుకు ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సైతం అందుకోసం ఏర్పాట్లు చేసింది. కానీ డబుల్ బెడ్‌రూం నిర్మిస్తున్న అధికారులు మాత్రం రోడ్డు పక్కనే డబుల్ బెడ్ రూం సముదాయాల డ్రైనేజీ లైన్ వేసి రోడ్డు పక్కనే ఎస్టీపీ నిర్మాణం చేశారు. దీంతో త్వరలో నిర్మించే 100 ఫీట్ల రోడ్డు మధ్యలో ఈ ఎస్టీపీ వచ్చే అవకాశం ఉంది. మరి ఇలాంటి పరిస్థితిలో అధికారులు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను కానీ, మేయర్ నీలా గోపాల్‌రెడ్డిని కానీ సంప్రదించి సమన్వయం చేసి ఉంటే బాగుండేది. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా తొలగించాల్సి వస్తే డబుల్‌బెడ్ రూం వాసులకు ఇబ్బంది. నిధులు దుర్వినియోగం చేసినట్లు అవుతుందని పలువురు ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు.

చెత్త డంపింగ్‌ను తరలిస్తారా?

డబుల్ బెడ్‌రూంల సముదాయాన్ని ఆనుకునే చెత్త డంపింగ్ కేంద్రం ఉంది. ప్రతి రోజు 120 టన్నుల వరకు చెత్తను వివిధ కాలనీల నుంచి, బస్తీల నుంచి సేకరించి ఇక్కడ వేస్తారు. మరి ఇప్పటికే డంపింగ్ యార్డుకు కిలో మీటర్ నుంచి రెండు కిలో మీటర్ల వరకు దూరంలో ఉన్న కాలనీల్లో, బస్తీల్లో దోమలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా చెత్త తగులబడ్డప్పుడు వ్యర్థ రసాయనాలు వెలువడి ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితిలో డబుల్ బెడ్ రూం నివాసుల పరిస్థితి ఏంటని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. తాము ఇండ్లల్లో చేరక ముందే డంపింగ్ యార్డును తొలగిస్తే బాగుంటుందని వారు అభిప్రాయడుతున్నారు.





రోడ్డు పక్కనే ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ లైన్



వరద నీటితో సెల్లార్

రేపటి నుంచి స్వామి చిదాత్మానంద ప్రవచనాలు

మోతీనగర్: మూసాపేట డివిజన్ మోతీనగర్ రాయల్ గార్డెన్‌లో శుక్రవారం నుంచి ఆదివారం వరకు విజయ రహస్యంపై స్వామి చిదాత్మనంద ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయం సాధించడానికి ఏది అవసరం, అదృష్టమా? లేక దేవుడా? అనే విజయ రహస్యంపై స్వామి చిదాత్మానంద ప్రవచనాలు ఉంటాయని తెలిపారు. మూడు రోజులు పాటు ప్రతి రోజు సాయంత్రం7 నుంచి 8 గంటల వరకు ప్రవచనం ఉంటుందని పేర్కొన్నారు.

జేఎన్‌టీయూహెచ్‌లో నియామకాలు



ప్రొఫెసర్ ఎన్.వి. రమణ



డాక్టర్ ఎంవీఎస్ఎస్ గిరిధర్

కూకట్‌పల్లి: జేఎన్‌టీయూహెచ్‌లో ఈఈఈ విభాగం సీనియర్ ప్రొఫెసర్, డిప్యూటి డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.వి. రమణ ఇన్‌చార్జి అకాడమిక్ అఫైర్స్‌గా, సెంటర్ ఫర్ వాటర్ రిసోర్సెస్, జేఎన్‌టీయూహెచ్ యూసీఈఎస్‌టీహెచ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ గిరిధర్‌ను ఇన్‌చార్జి డైరెక్టర్‌గా, ఇంటర్నేషనల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్‌గా నియమిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. కె. వెంకటేశ్వరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

తప్పనిసరిగా టీకా వేయించుకోవాలి



టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని శంషీగూడ వార్డు కార్యాలయంలో జపనీస్ ఎన్సెఫాలిటిస్‌కి వ్యతిరేకంగా మెదడు వాపు వ్యాధి రాకుండా చిన్నారులకు బుధవారం టీకాలు వేశారు. కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ హాజరై టీకా కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 9 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి ఒక్కరికి తప్పనిసరిగా టీకాలు వేయించాలని తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో బోరు ఏర్పాటు

శంషీగూడ ప్రభుత్వ పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న బోరును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి కొరత లేకుండా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు టి. నరసింహులు, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎం. సుందర్‌రావు, జి. నరసింహులు, రాజేందర్ పాల్గొన్నారు.

పై అధికారులు వేధిస్తున్నారు.. ఆత్మహత్యే శరణ్యం

- బాలానగర్ తహసీల్దార్ కార్యాలయ అటెండర్ అనిల్
- అనారోగ్యంతో బాధపడుతున్నా పనులు చేసుకురమ్మంటూ పురమాయింపు



బాలానగర్: మండల కార్యాలయంలోని ఓ సీనియర్ అసిస్టెంట్, తహసీల్దార్ వై శ్రీనివాసులు తన ఆరోగ్య పరిస్థితిని చూడకుండా వేధింపులకు పాల్పడుతున్నారని అటెండర్ అనిల్ ఆవేదన వ్యక్తం చేశాడు. బుధవారం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గంజాయి కేసులో పంచనామా నిర్వహించేందుకు వాకర్ సాయంతో వచ్చిన అటెండర్ అనిల్‌ను చూసి పలువురు మీడియా ప్రతినిధులు పలకరించారు. ఆరోగ్యం బాగోలేకపోయినా విధులు ఎందుకు నిర్వర్తిస్తున్నారని ప్రశ్నించగా, తనకు యాక్సిడెంట్ అయిందని అనిల్ వివరించాడు. తీవ్ర అనారోగ్యంతో కూడా చిన్నచిన్న పనులు చేస్తున్నానని, అయినా కూడా తహసీల్దార్ తనను వేధిస్తున్నారని ఆరోపించాడు. వేధింపులు తాళలేకపోతున్నానని, ఇక తహసీల్దార్ శ్రీనివాసులు, ఓ సీనియర్ అసిస్టెంట్ పేర్లు రాసి ఆత్మహత్య చేసుకోవడమే తనకు శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని కోరాడు.

అలాంటిదేమీ లేదు..

అనిల్‌పై జరుగుతున్న వేధింపులపై బాలానగర్ తహసీల్దార్ శ్రీనివాసులును మీడియా వివరణ కోరగా.. అనిల్‌పై ఎలాంటి వేధింపులు లేవని వివరించారు. జీతం సక్రమంగానే ఇస్తున్నామని, ఆఫీస్‌కు వచ్చి కేవలం కుర్చీలో కూర్చుంటాడని, ఎలాంటి ఇబ్బంది పెట్టట్లేమని పేర్కొన్నారు. కాగా, పంచనామా గురించి కిందిస్థాయి సిబ్బందికి చెప్పగా, అనిల్‌ను పంపించి ఉంటారని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే వివేకానంద్‌కు సమస్యను వివరిస్తున్న బాచుపల్లి డబుల్‌బెడ్‌రూం లబ్ధిదారులు

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బుధవారం పేట్‌బషీరాబాద్‌లో క్యాంప్ కార్యాలయానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పలు కాలనీలు, బస్తీల ప్రజలు విచ్చేసి స్థానిక సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించారు. అదే విధంగా పలువురు ఆహ్వాన పత్రికలు అందజేశారు.

- బాచుపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్దిదారులు దాదాపు 50 మంది ఎమ్మెల్యేను కలిసి భూగర్భ డ్రైనేజీ, మంచినీటి సౌకర్యం, ప్రహరీ నిర్మాణం, కరెంటు సమస్యలను వివరించారు. దీనిపై స్పందించిన వివేకానంద్.. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. బీఆర్ఎస్ నాయకులు నదీమ్ రాయ్, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్దిదారులు అశోక్, దుర్గా ప్రసాద్ తదితరులు

గుర్రపు డెక్క తొలగింపు పనులు ప్రారంభం



గంగారం చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

చందానగర్: గంగారం పెద్ద చెరువులో సుందరీకరణలో భాగంగా చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి, డీసీ రజినీకాంత్‌రెడ్డి, కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి, ఉప్పలపాటి శ్రీకాంత్, ఇరిగేషన్ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు సుందరీకరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు తుది దశలో ఉన్నాయన్నారు. చెరువు చుట్టుపక్కల ప్రజల విజ్ఞప్తి మేరకు గుర్రపు డెక్క తొలగింపుకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పనులను త్వరతగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. గుర్రపు డెక్క తొలగింపుతో దోమల బెడద తగ్గుతుందన్నారు. చెరువు కట్ట పటిష్టం, మురుగు నీరు చెరువులో కలవకుండా ప్రత్యేక మురుగు కాలువ నిర్మాణం, అలుగు మరమ్మతులు, వాకింగ్ ట్రాక్ తదితర పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సంరక్షణలో భాగంగా చెరువు చుట్టు కంచె నిర్మిస్తామన్నారు. ఇరిగేషన్ అధికారులు డీఈ నళిని, ఏఈ పావని, ఎస్ఈ శంకర్ నాయక్, ఈఈ కెవిఎస్ రాజు, డీఈలు శిరీష, దుర్గ ప్రసాద్, స్రవంతి, ఏఈ సంతోష్‌రెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ రవి, రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ సందేహాల నివృత్తికి హెల్ప్‌డెస్క్‌లు

జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

సాక్షి, సిటీబ్యూరో: ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులకు మార్గనిర్దేశం చేయటానికి కలెక్టరేట్‌లో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామని జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికాగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల కోసం జిల్లా స్థాయిలో కలెక్టరేట్‌లో, ఎంపీడీఓ, మున్సిపాలిటీ కార్యాలయాల్లో కూడా హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలకు ఎలాంటి సందేహాలున్నా ఆయా హెల్ప్ డెస్క్‌లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. గతంలో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న వారు అవసరమైన మేరకు డాక్యుమెంట్లు ఇవ్వని పక్షంలో ఇప్పుడు తీసుకుని ఎల్ఆర్ఎస్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. అవసరమైన మేరకు రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు కలెక్టరేట్‌లో జాబ్ మేళా

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎం.రాధిక ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో జ్యోతిష గ్రూప్‌లో సేల్స్ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ (పోస్టులు: 900) పోస్టులకు విద్యార్హత ఏదైనా డిగ్రీ ఉండాలన్నారు. వేతనం రూ. 15 వేలు ఉంటుందన్నారు. టెలీ కాలర్స్ (ఖాళీలు:30)కు విద్యార్హతలు ఎస్ఎస్సీ, ఇంటర్ చదివిన వారు అర్హులన్నారు. వేతనం రూ. 12 వే లు ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిని జిల్లాలోని యువత ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆయా కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు ఇంటర్వ్యూలలో పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అదనపు సమాచారం కోసం ఫోన్: 98664 65024లో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

కుత్బుల్లాపూర్: ప్రమాదవశాత్తు ఓ కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.. పోలీసుల వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన మనీష్‌కుమార్ సింగ్(39) బాలానగర్‌లోని రాజు కాలనీలో నివాసముంటున్నాడు. దూలపల్లిలోని శ్రీదుర్గా మెటల్స్ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజు మాదిరిగా బుధవారం మనీష్‌కుమార్ డ్యూటీకి వెళ్లాడు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పరిశ్రమకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతంతో స్పృహ తప్పి పడిపోయాడు. అతడిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఆకట్టుకున్న 'సంస్కృత భాషా దినోత్సవం'



సంస్కృత భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు



రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్ స్కూల్‌లో 'సంస్కృత భాషా దినోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం క్యాంపస్ స్కూల్ సంస్కృత టీచర్ డాక్టర్ లంకపార్థ సారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భాషపై విద్యార్థులకు మరింత అవగాహన, ఆసక్తి పెంచేలా శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన తదితర కార్యక్రమాలతో ఆద్యంతం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. సంస్కృత భాషను వివరిస్తూ విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో క్యాంపస్ స్కూల్ ప్రిన్సిపాల్ పి మురళి మాట్లాడుతూ అన్ని భాషలకు తల్లిభాషగా సంస్కృత భాష గుర్తింపు పొందిందన్నారు. ఒకప్పుడు రాష్ట్ర భాషగా, వ్యవహార భాషగా కూడా గుర్తింపు ఉండేదని గుర్తు చేశారు. కంప్యూటర్‌కు అనుగుణమైన ఏకైక భాష సంస్కృత భాష, మన సైన్స్ అండ్ టెక్నాలజీ సంస్కృత భాషలోని నిక్షిప్తమై ఉన్నదని ఇలాంటి తల్లి భాషను మనం మర్చిపోకూడదన్నారు. శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి-మేడ్చల్ రోడ్డు విస్తరణకు అడ్డంకులు తొలగించాలి

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్



సాక్షి, సిటీబ్యూరో: జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 రోడ్డు విస్తీర్ణంలో భాగంగా బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు రూ. వెయ్యి కోట్ల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు విస్తరణ పనులలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు సంబంధిత శాఖల అధికారులు సహకరించి, నిర్మాణ పనులు చురుగ్గాసాగి పూర్తయేలా చూడాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్‌రెడ్డితో కలసి ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. బోయిన్‌పల్లి నుంచి మేడ్చల్ వరకు నిర్మిస్తున్న ఆరు లేన్ల రోడ్డు పనులపై ఎదురవుతున్న సమస్యలను సంబంధిత ప్రాజెక్టు డైరెక్టర్‌తో కలెక్టర్ చర్చించారు. రోడ్డు విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో అడ్డుగా ఉన్న పెట్రోల్ బంక్ అనుమతులను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారికి కలెక్టర్ గౌతమ్ సూచించారు. అండర్ పాస్ స్లిప్ రోడ్ పనులు, విద్యుత్ టవర్స్, డ్రెయిన్లు, పైప్ లైన్ తదితర పనులకు ఎలాంటి ఆటంకం కలుగకుండా సంబంధిత అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సత్వరమే ఇతర స్థలాలో కూడా అవార్డుల క్లియరెన్స్‌కు చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ చెల్లింపులు జరిగిన స్థలాలు అప్పగించటానికి సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఏఐ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసరావు, ఆర్డీఓలు ఉపేందర్‌రెడ్డి, శ్యామ్‌ప్రకాష్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ కంప్రెషర్ సీజ్



సర్వే నెంబరు 79లో బండరాళ్లను కటింగ్ చేస్తున్న దృశ్యం



ప్లాట్‌గా మార్చిన ప్రభుత్వ స్థలం

సుభాష్‌నగర్: ప్రభుత్వ స్థలాన్ని ప్లాట్‌గా మార్చేందుకు ఓ వ్యక్తి అందులో ఉన్న బండరాలను తొలగిస్తున్న క్రమంలో ట్రాక్టర్ కంప్రెషర్‌ను రెవెన్యూ అధికారులు బుధవారం సీజ్ చేశారు. గాజులరామారం డివిజన్ నల్లగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ఆనుకొని ఉన్న సర్వే నెంబర్ 79లో ఓ వ్యక్తి టీఐసీసీకి కేటాయించిన స్థలాన్ని కబ్జా చేసేందుకు మూడు నెలల నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. బండరాళ్లను తొలగించి సుమారు 300 గజాలను ప్లాట్‌గా చేశాడు. మిగతా స్థలంలో ఉన్న బండారాలను మూడు రోజులుగా తొలగిస్తుండగా.. సమాచారం అందుకున్న తహసీల్దార్ అబ్దుల్ రహమాన్ ఖాన్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గులాం ఖలీల్ బుధవారం అక్కడికి చేరుకుని పనులను నిలిపి వేశాడు. కంప్రెషర్‌ను సీజ్ చేశారు. వ్యక్తిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

గతంలో బండరాళ్లను పేల్చి..

సదరు వ్యక్తి ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసేందుకు అందులో ఉన్న బండరాలను తొలగించేందుకు జూన్ 15న పేలుడు పదార్థాన్ని ఉపయోగించాడు. దీంతో ఒక్కసారిగా భారీ పేలుడుతో ఆ ప్రాంతం ఉలిక్కి పడింది. సమాచారం అందుకున్న అప్పటి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక తమ సిబ్బందితో అక్కడ చేరికోగా.. సదరు వ్యక్తి పరారయ్యాడు. అప్పటి నుంచి సైలెంట్ గా ఉన్న వ్యక్తి గత 3 రోజుల నుంచి పనులు మొదలుపెట్టడంతో రెవెన్యూ అధికారులు చెక్ పెట్టారు.